
# చరిత్రలో ఓ పేజీ!

– వేదుల శకుంతల



మిట్టమధ్యాహ్నం వేళ!

ఎండ మండిపోతోంది!!

పైన ఫాన్ తిరుగుతూనే వుంది. అయినా గాలి చల్లగా లేదు. వేడిగాలి గదిలో సుళ్ళు తిరుగుతోంది. పోనీ ఫాన్ ఆపేద్దామంటే... చెమటలు! ఒళ్ళంతా తడిసి పోతుంది!! వేడిగా వున్నా – గాలే నయం. చెమటలైతే చిరాకు!

మడత మంచం మీద వడుకున్న రామచంద్రమూర్తి గారు, ఈ వైపు నుంచి ఆవైపుకీ, ఆవైపు నుంచి ఈవైపుకీ, పెనం మీద అట్టు తిరగేసినట్టు వీపుని తిప్పేస్తున్నారు.

ఆ మంచం పక్కనే నేల మీద, తలకింద మెత్తని చీరని చుట్టలా చుట్టి పెట్టుకుని పడుకుంది కృష్ణవేణమ్మ. బాగా అలసిపోయి–ఒళ్ళెరుగకుండా నిద్రపోతూంది. తెల్లవారు ఝామున నాల్గు గంటలకి లేచీ కృష్ణవేణమ్మ వంటా పూజా

ముగించి - అందరికీ భోజనాలు పెట్టి - తను తిని, వంటిల్లు సర్దుకుని - హాల్లోకి వచ్చేసరికి నిద్ర ముంచుకు వస్తుంది. కళ్ళు మూతలు పడి పోతూవుంటాయి. పక్క వేసుకోవాలనికానీ, ఫాను కావాలని కానీ, ఆమెకి తోచదు. నిలబడకుండా ఎక్కడో ఒక చోట వాలి, కళ్ళు మూసుకుంటే చాలు! ఒళ్ళు మరచిపోయేటంత నిద్ర వచ్చేస్తుంది. 'నిద్ర సుఖమెరగదు' అన్నపదం ఆమెపట్ల సత్యమనిపిస్తుంది. మళ్ళీ గంటా గంటన్నర తర్వాత, ఠంచనుగా మెలుకువ వస్తుంది. టీ పెట్టాలనీ, టిఫెన్ చేయాలనీ- నిద్రలో కూడా జ్ఞాపకం వస్తుందేమో?

అరగంట నుంచి నిద్రపట్టక అవస్థ పడుతున్న రామచంద్రమూర్తిగారు పక్కకి వొంగి కింద పడుకున్న భార్యని చూసేరు. ఆమె రవిక ఓ పక్కన అంతా తడిసిపోయి నేల కూడా చెమ్మగిల్లివుంది. ముఖం మీద కుంకుమ బొట్టు చెమటకి కరిగి చారికలా సాగింది! చెంపలకి జుట్టు అతుక్కుని, నీటిలో ముంచి పడేసిన గడ్డిపరకల్లా ఉన్నాయి. కాళ్ళమీద చీరపైకి తొలగింది. ఉక్కపోతకి చెమట కాయలు వచ్చి... గోకటం వలన గీరలు పడి నల్లగా మచ్చలు తేలేయి. నేల మీద చాపిన చేయి, చర్మం ముడతలు పడి జవచచ్చిన వంకాయలా వేలాడుతోంది. అరచేతిలో కత్తిపీట గాట్లు, బండ బారిన చర్మం, నాజూకుతనం మింగేసి, మొరటుతనం తొంగిచూస్తోంది.

ముప్ఫై ఏళ్ళ క్రింద - భార్యని గురించి, ఆమె శరీర దారుఢ్యం గురించి, సంరక్షణ గురించి, కొద్దిగా ఆలోచించే వారు రామచంద్రమూర్తిగారు - అప్పుడు, కృష్ణవేణమ్మ వయస్సు, నలభై ఆరు సంవత్సరాలు! ఆ తర్వాత ఇంటి బాధ్యతలు మరీ పెరగడంతో, ఆమెను గురించి ఆలోచించడం తగ్గి - 'ఆ! ఇంటి పనులు తనకీ వున్నాయి కదా? శ్రద్ధగా ఆరోగ్యం గురించి ఎలా చూసుకోగలదు?' అని సరిపెట్టుకోవటం అలవాటు చేసుకోసాగేరు. మరి కొన్నాళ్ళు గడిచేక భార్య అందచందాలు, తీరుతెన్నులు పట్టించుకోవటం మర్చిపోయేరు.

ఇంక ఇటీవల - 'ఒకప్పుడు భార్యని గురించి ఆలోచించేవాణ్ణికదా?' - అన్న విషయం కూడా జ్ఞాపకం చేసుకోలేక పోతున్నారు.

ఇప్పుడు రామచంద్రమూర్తి గారు ఎనభైరెండు సంవత్సరాల జీవితపు మైలు రాళ్ళు దాటుకుని వస్తే - భార్య ఆయన వెనుకే నీడలా వెన్నంటివస్తూ డెబ్బై అయిదేళ్ళ కాలమానపు కొలతరాళ్ళు వెనక్కి నెట్టింది.

కృష్ణవేణమ్మ, వెండి తీగల్లా..... పట్టుకుచ్చులా వున్న జుట్టు ముచ్చట ముడి వేసుకుంటే-దోసెట్లో ఇమిడి, కరిగించిన వెండి ముద్దలా వుంటుంది. ఇప్పుడు ఆ ముడి విడిపోయి- నేల మీద పరచుకుని ఒలకబోసిన పిండి ముగ్గులా వుంది.

క్షణం భార్యవైపు చూసి 'వెర్రి బాగుల్ది! నిద్రసుఖమే తప్ప - చెమటకి చికాకు గాని, ఉక్కపోత ఉబ్బరింపు కానీ తెలుసుకునే స్థితిలో లేదు. మళ్ళీ మెలుకువ వచ్చిందంటే - పని గొడవలో పడిపోతుంది. అంతవరకు, ఆదమరచిన ఆ నిద్రే... ఆమెకు లాలింపు!' అనుకున్నారు. 'అదృష్టవంతురాలు! అలసిపోయేలా చాకిరీ చేసి హాయిగా పడుకోగలదు!! నాకు ఆ అదృష్టం లేదు.' ఆ! ఉఫ్! అంటూ మళ్ళీ ఈవైపు నుంచి ఆవైపుకి వీపు తిరగేసేరు.

పి.డబ్ల్యూ.డి ఆఫీసులో సెక్షన్ హెడ్‌గా చేసి రిటైర్ అయి -పాతికేళ్ళు -కాబోతోంది. అప్పట్నుంచీ ఆయనకి తీరికే! కానీ భార్యకి రిటైర్‌మెంట్ లేదు. అయినా పనులు కల్పించుకుని చేస్తూనే వుంటుంది. మేడ మీద రెండు గదుల్లో బ్రహ్మచారి కుర్రాళ్ళు ఉద్యోగాలు చేసుకుంటూ - పేయింగ్ గెస్టుల్లా ఉంటున్నారు. తమకి అలాంటి ఉద్దేశ్యం లేదని ఎంత చెప్పినా - వాళ్ళు వినలేదు.'మాకు దగ్గరలో మంచి హోటల్ లేదనీ, మేము స్వయంగా వండుకోలేమనీ - మీ దగ్గర ఉచితంగా తినలేమనీ' ఎంతో బ్రతిమాలి - ఒప్పించారు.

అప్పట్నుంచీ కృష్ణవేణమ్మకి -తీరికే లేదు. అసలు వయసులో ఉన్నప్పుడు మాత్రం తీరుబాటు ఎక్కడ? -

ముగ్గురు ఆడపిల్లల పెళ్ళిళ్ళు...పురుళ్ళు... చాకిరీలతో అలసిపోయింది. ఖర్చుకి ఖర్చు - చాకిరీలు! మొదటి భారం తనది.. రెండో బరువు ఆమెది! తామిద్దరూ త్రాసుకి రెండు వైపులా తూకం చూసుకుంటే... ఆమెదే అడుగు అంటేది! అవును

మరి? తనకి డబ్బు కూర్చుకునేందుకు-రకరకాల లోన్లు-ఆదుకునేవి! కానీ ఆమెకి బంధువులెవరూ ఆసరా లేరు. అన్ని పనులు ఆవిడే చేసుకోవలసి వచ్చేది. అక్క చెల్లెళ్ళు లేరు. అన్నగారు వదినగారు పల్లెటూరులో వ్యవసాయం పనులతో ఎక్కడికీ కదిలేవారుకాదు. శుభకార్యాలకి వచ్చి -ఆపూట ఉండి, -'అమ్మో వెళ్ళిపోవాలి పాడి పంట, గొడ్డు గోదా చూసుకోవాలని'-ఆరాట పడిపోయి రైలు ఎక్కేసేవారు. వంటవాళ్ళు, పనివాళ్ళు వెళ్ళిపోయేక-మిగతా పనులు ఎన్నో ఉండేవి! అవన్నీ పాపం తనే సర్దుకోవలసి వచ్చేది. పెద్ద కూతురు పెళ్ళి అయి అత్తవారింటికి మూడు నిద్దర్లకి(మనుగడుపులకి) వెళ్తే-మిగతా ఇద్దరు అమ్మాయిలు అక్కకి తోడు వెళ్ళేవారు. అలాగే.. రెండో కూతురు పెళ్ళప్పుడు మిగతావారిని పంపేది! అందుచేత భార్యకి ఎప్పుడూ చేతి ఆసరాకి ఎవరూ ఉండేవారు కాదు. ఆమె వైపువాళ్ళు పనులున్నాయని వెళ్ళిపోతే-తన అక్క చెల్లెళ్ళు-ఆడబడుచు అలకలతో మూతులు ముడుచుకుని వెళ్ళిపోయేవారు!

ఏమైతే నేమి? కృష్ణవేణమ్మకి మొదటి నుంచి అలుపే తప్ప సుఖం లేదు? రామచంద్రమూర్తి గార్కి నిద్రపట్టక, పాతజ్ఞాపకాలన్నీ ఫాను గాలిలో కలిసి ఊదరగొట్టి పారేస్తున్నాయి.

మళ్ళీ ఆవైపు నుంచి ఈవైపుకి తిరిగేరు- పక్కకి వొంగి భార్యవైపు చూసేరు. ఆదమరచి నిద్రపోతోంది కృష్ణవేణమ్మ. చాపిన చెయ్యి ముడుచుకుంది. రెండో చెయ్యి పొట్టమీద వేసుకుంది. మణికట్టు దగ్గన చిన్న గాయపు గుర్తు! అదొక చిత్రమైన అనుభూతికి సంకేతం!

ఓ సంఘటన వలయంలా తిరిగింది.

పొట్టమీద చెయ్యి... గర్భవాసాన్ని సూచిస్తే -ఆ కడుపు పంట చేసిన అల్లరి వల్లనే కల్గిన గాయం ఇది!? అన్నట్టుగా వుంది! ఆడపిల్లల వెనుక చాలాకాలం మళ్ళీ సంతానం కలగలేదు తమకి!తర్వాత ఎంతగానో ఎదురు చూసేక - మగపిల్లాడు పుట్టేడు. సుప్రభాత సమయంలో పుట్టేడని 'సుప్రకాశ్' అని పేరు పెట్టుకున్నారు. అపురూపంగా పెంచేరు-అక్కలు 'తమ్మి-తమ్మి' అంటూ తెగ ఎత్తుకు మోసేరు. కోరినదల్లా ఇవ్వటమే కానీ, - 'లేదు-వద్దు' అన్న పదాలు వాడి ముందు ఎప్పుడూ అనలేదు. ఇక కృష్ణవేణమ్మకి వాడే.. ప్రపంచం, సర్వస్వం! వాడి సంరక్షణలో ఎంతో ఆనందం పొందేది. ఒకసారి తలకి నూనె రాయబోతే వాడు పెరడంతా పరిగెట్టించి అందకుండా మేడమెట్లు ఎక్క బోతుంటే- 'అయ్యో వద్దురా నాన్నా! నేను మెట్లు ఎక్కలేను' అంటూ నూనె ఒలికి పోకుండా చేయి పైకి ఎత్తి పెట్టి - మెట్ల రేలింగ్ పట్టుకోబోయి జారి పడింది. గాజులు పగిలి మణికట్టులో గుచ్చుకున్నాయి. రక్తం ధార కట్టింది! తను కంగారు పడి - 'వెధవాయ్! అమ్మకి దెబ్బతగిలింది చూడు'-అంటూ గబగబ తీగమీద ఉన్న తువ్వాలు అందుకుని చేతికి చుట్టేడు-ఆడపిల్లలు-తల్లిపక్కన చేరి బాధపడుతుంటే- వాడు.. ఆ సుప్రకాశ్ గాడు- నవ్వుతూ 'మా బాగా అయింది. లేకపోతే నాకు నూనె ఎందుకు రాయాలి?' అని చప్పట్లు కొట్టేడు-అప్పుడు వాడి వయస్సు నాల్గేళ్లు!!

తనకి కోపం వచ్చి వాడిని కొట్టబోతే-కృష్ణవేణి అడ్డుకుంది. 'చిన్నవాడు! వాడినేమీ చేయకండి!' అంది.

తర్వాత డాక్టర్ని పిలిపించి కట్టు కట్టించేరు. గాయం తగ్గినా- మచ్చమాయలేదు! అది జరిగి ఎన్నో ఏళ్ళు గడిచిపోయాయి.

ప్రకాశ్‌కి ఐదేళ్ళు నిండుతున్నప్పుడు రెండో కొడుకు చంద్రశేఖర్ పుట్టేడు-వాడినీ అంతే! అపురూపంగా చూసేది. వాడి అల్లరి పనులకీ వెన్నుకాచి అడ్డుకునేది.

'మన కన్నబిడ్డలండి! మన కనుపాపలు!!సూర్య చంద్రులు!! వంశోద్ధారకులు!!! అంటూ మురిసిపోయేది. వాళ్ళు ఇంజనీర్లు, డాక్టర్లు కావాలని తెగ ఆరాటపడేది!

నిజంగానే వాళ్ళు చదివేరు. పెద్దవాడు డాక్టర్!ఎక్కడ? అమెరికాలో భార్యా పిల్లలతో ఉన్నాడు! చిన్నాడు ఇంజనీర్! వాడో??! నార్త్ ఇండియాలో రైల్వే ఇంజనీర్! ఎప్పుడో.. వచ్చి పెళ్ళాం పిల్లలతో ఒకవారం ఉండి వెళ్ళిపోతాడు.

వాళ్ళు ఎక్కడో అందనంత దూరాల్లో ఉద్యోగాలు చేస్తున్నారు. కావాలనే - వాళ్ళు -అక్కడకి వెళ్ళేరు. మోజుపడి అయినవాళ్ళకి

దూరంగా ఉండాలనే వెళ్ళేరు!

'పిచ్చిది! వెర్రిబాగుల్ది!మా పిల్లలో.. మా పిల్లలో' అని ఆరాటపడుతుంది. వీపు మళ్ళీ ఇటు తిప్పేరు-రామచంద్రమూర్తిగారు.

రెండు నెలల్లో ప్రకాశ్ ఇండియా వస్తున్నాడు- అప్పుడే చంద్రం కూడా సెలవు పెట్టి వస్తాడు. 'ఈ సారి వాళ్ళకి గట్టిగా చెప్పాలి. మీరింక ఇక్కడే ఉండిపోండి. మేము వృద్ధులమై పోయాం. అందరం కలిసివుందాం!' అని. అప్పుడు కొడుకులు కోడళ్ళు మనుమలు వుంటే ఈ కృష్ణవేణికి అలుపూ వుండదూ.. చింతా వుండదు' అనుకున్నారు-

అలా అనుకున్నాక రామచంద్రమూర్తిగార్కి మెల్లగా నిద్రపట్టింది. మనసు చల్లబడిందో...లేక.. చమటకి వేడిగాలి తగిలి శరీరం చల్లగా అనిపించిందో..కానీ... నిద్రమాత్రం జోకొట్టింది!

సరిగ్గా ఆ సమయంలోనే కృష్ణవేణమ్మకి మెలుకువ వచ్చింది! "అయ్యో టిఫిన్ చేయాలి, టీ పెట్టాలి. ఆ కుర్రాళ్ళు నాలుగున్నర కల్లా వచ్చేస్తారు. మళ్ళీ ఈవినింగ్ కాలేజి అంటూ ఐదున్నరకల్లా బయటికి వెళ్ళిపోతారు. వాళ్ళ దగ్గర డబ్బు తీసుకుంటున్నప్పుడు -కావల్సిన సదుపాయాలన్నీ చేయాలి కదా? అప్పుడే మూడు గంటలు అవుతోంది-" గోడ గడియారంలో టైం చూసుకుని - లేచి కూర్చుని జుట్టు గట్టిగా ముడివేసుకుంటూ పక్కన మంచం మీద పడుకున్న భర్తని చూసింది.

'పాపం! నిద్రపోతున్నారు. గాలి వేడిగా వుంది. ఈ సారి ఒక కూలర్ కొనమని చెప్పాలి!' అనుకుంది ఆప్యాయంగా!

మర్నాడు పొద్దున్నే 'ట్రింగ్... ట్రింగ్'మని ఫోను మోగింది!

ఇంత పొద్దున్నే ఫోను మోగిందంటే- అది తప్పకుండా పెద్దాడి దగ్గర్నుంచే అయివుంటుంది' అనుకుంటూ... పేపర్ అక్కడ పడేసి కుర్చీలోంచి లేచి ఫోను అందుకున్నారు, రామచంద్రమూర్తిగారు. వంటింట్లో కాఫీ కల్పుతున్న కృష్ణవేణమ్మ వచ్చేసింది- ''ఇలా ఇవ్వండి, ఇలా ఇవ్వండి" -అంటూ! "ఉండవే! నన్ను మాట్లాడనీ" అని ఆయన ఫోను గట్టిగా పట్టుకున్నారు.

చిన్న పిల్లలు స్కూల్లో జిలేబి చుట్టల కోసం ఎగిరి ఎగిరి పడే ఆటలాగ అమెరికా ఫోను - ఆ తల్లితండ్రులకి అంత మధురం.. మరెంతో ఆనందం!

అరగంట సేపు మాట్లాడినా అసంతృప్తిగానే అనిపించింది. అయితే - రెండు నెలల్లో వస్తాడనుకున్న ప్రయాణం. ఒక నెలలోనే వస్తున్నాడని తెలిసి -సంతోషపడి పోయారు. పైగా ఈ సారి రెండు నెలలు ఉంటానన్నాడు. ఇక చెప్పలేనంత ఆనందం! గబగబా కాఫీ కల్పుకుని వచ్చింది.ఏమండీ? మరి అబ్బాయి పిల్లలు వస్తే పైన గదులు ఖాళీ చేయించవద్దూ? అంది.

కాఫీ గ్లాసు అందుకుంటూ "బాగుంటుందంటావా? అయినా ఇలా పేయింగ్ గెష్టులని పెట్టుకున్నామంటే - అబ్బాయి ఏమనుకుంటాడో? ఊహూ? ఏమైనా సరే ఆ కుర్రాళ్ళకి చెప్పేస్తాను. ఎక్కడైనా మరొకచోట ఇల్లు చూసుకోమని చెప్తాను. లేకపోతే కోడలు ఏమనుకుంటుందీ? మనమలు కూడా పెద్దవాళ్ళయ్యారు కదా, నవ్వుతారు. అబ్బెబ్బే! అస్సలు బాగుండదు ఇవాళ సాయంత్రం వాళ్ళతో మాట్లాడుతాను" అన్నారు రామచంద్రమూర్తి గారు.

కృష్ణవేణమ్మకి మనసులో బాధ అనిపించినా -'మరి తప్పదు కదా?' అని సరిపెట్టుకుంది.

ఆ సాయంకాలమే రామచంద్రమూర్తిగారు మేడమీదుండే కుర్రాళ్ళతో విషయం అంతా చెప్పి -"మా అబ్బాయి వాళ్ళు ఇక్కడే వుండి పోతారు... కనుక ఇల్లు ఖాళీ చేయాల్సి వుంటుంది. లేకపోతే మాకు సరిపోదు.." అన్నారు.

ఇక వాళ్ళు ఏమీ చెప్పలేక ఒక వారంలో మరొక చోట ఏర్పాటు చేసుకుంటాం అన్నారు.- ఈ వారం రోజులు రామచంద్రమూర్తి గారూ, కృష్ణవేణమ్మా బోలెడు ఆలోచనలు చేసేరు- ఇక మీదట అబ్బాయిని ఇక్కడే వుండి పొమ్మనాలనుకున్నారు. వాడి ప్రాక్టీసు ఇక్కడే పెట్టుకుంటే.. పెరట్లో కావల్సినంత స్థలం వుంది గనుక నాల్గు గదులు కట్టించి డిస్పెన్సరీకి ఏర్పాటు చేయిద్దాం అనుకున్నారు. చంద్రం కూడా ఇక్కడికి ట్రాన్స్‌ఫర్ చేయించేసుకుంటే... అప్పుడు మేడమీద

బాల్కనీ వుంది కదా? అక్కడ మరొక పెద్ద గది కట్టించేస్తే సరిపోతుంది. చెరువు కట్ట పక్కన మామిడి తోట అమ్మేస్తే.. డబ్బు సరిపోతుంది-" అనుకున్నారు. అన్నీ పోగా మిగిలివున్నది ఆ ఒక్క తోటే! ఎప్పటికైనా అది మగపిల్లలకే కనుక-ఇప్పుడే అమ్మేద్దాం అనుకున్నారు- ఈ ఇల్లు వాళ్ళకే వుంటుంది-ఇక తన వొంటి మీదున్న కొద్దిపాటి నగా నట్రా ఆడపిల్లలకి ఇచ్చేయవచ్చును-' అని ఎన్నో నిర్ణయాలు చేసుకున్నారు- ఇద్దరి మనసులు ఒకటే - భావాలు ఒకటే. కలబోసిన ముత్యాల్లా.. ఒకే దారంలో గుచ్చిన దండలా రూపుదిద్దుకున్నాయి. యాభై ఏడేళ్ళ సాంసారిక జీవితంలో - ఒడి దుడుకులు, అనురాగ తరంగాలు ఒకేలా అనుభవించారు. ఈ చివరి మజిలీలో కూడా... ఏ మందులు ఏ టానిక్‌లు అవసరం లేకుండా ఆరోగ్యంగా ఉన్నారు! తమ పనులు తామే చేసుకుంటూ మరొకరికి చేయగల్గుతున్నారు. అది వారి అన్యోన్య దాంపత్య జీవితానికి, ఆదర్శ నియమావళికి నిదర్శనం!!

"చూడూ! మన అబ్బాయి రేపు ఇక్కడ ప్రాక్టీసు పెడితే -మనకి ఏ ట్రీట్‌మెంట్ చేయక్కర్లేదే? అని ఆశ్చర్యబోతాడేమో?!'' -అన్నారు రామచంద్రమూర్తిగారు...

కృష్ణవేణమ్మ ముసిముసి నవ్వులు నవ్వి తల ఊపింది.

ఆ మర్నాటి నుంచే -పని వాళ్ళని పిలిపించి పెరడంతా బాగు చేయించడం.. మొదలు పెట్టారు రామచంద్రమూర్తిగారు. కృష్ణవేణమ్మ కూడా కుర్రాళ్ళు గదులు ఖాళీచేసి వెళ్ళాక-అన్ని గదులు దులిపించడం.. బాగుచేయించటం-కడిగించటం మొదలు పెట్టింది-ఎక్కడెక్కడ ఏ అల్మారాలు అవసరమవుతాయో అని యోచించింది.

ఆ వృద్ధ దంపతుల ఓపికకి, శ్రద్ధకి, పులకించిపోతున్నట్టుగా పుడమితల్లి పులకించి వర్షించింది! అయితే చంద్రం రాసిన ఉత్తరంతో కొంచెం షాక్ తగిలినట్టైంది.

తను ప్రస్తుతం రావట్లేదనీ.. తనకి మరొక ఊరు బదిలీ అయిందనీ -రాసేడు. సరే! ఉద్యోగాలన్నాక బదిలీలు తప్పవు కదా? అని సరి పెట్టుకున్నారు.

అమెరికా నుంచి ప్రకాశ్, భార్యా పిల్లలు వచ్చారు. పలకరింపులు, విశేషాలు అన్నీ ముచ్చటించుకున్నాక స్నానాలు భోజనాలు పూర్తిచేశారు. కోడలు అంటీ అంటనట్టు - ముట్టీ ముట్టనట్టు -చూసీ చూడనట్టు -ఆమె వాలకం అదొకలాగా వుంది! కృష్ణవేణమ్మ గమనిస్తూనే వుంది. ఆ వేషధారణ, ఆ హొయలు, ఆ చూపులు, పరీక్షిస్తూనే వుంది! అయినా సహజమేలే! ఎన్నాళ్ళ నుంచో అమెరికాలో ఉన్నారు కదా? మాతృదేశంలో ఉన్నవాళ్ళకే -మన్నన-మర్యాదా మరచిపోతున్న రోజులు!? కొన్నాళ్ళైతే అదే అలవాటు అవుతుంది! అనుకుంది కృష్ణవేణమ్మ.

మనమలు-రాహుల్, రాకేష్ తెలుగు పదాలని ఇంగ్లీషు స్టైల్లో పలుకుతూ.. బెడ్ కాఫీలు, వెంట తెచ్చుకున్న క్యాసెట్లు వింటూ, వీడియోలు చూస్తూ - అమ్మా నాన్నలతో మాత్రమే గలగల మాట్లాడేస్తూ.. తాతయ్యతో- బామ్మతో-హలో, హాయ్ అని పొడిగా పలకరించి ఊరుకున్న తీరు రామచంద్రమూర్తి గారికి కొంచెం బాధ కలిగించినా 'పసిపిల్లలప్పట్నుంచి అమెరికాలో పెరిగారు కదా?'- అని సర్దుకున్నారు. ఇక మీదట ఇక్కడే ఉండి పొమ్మని కొడుకుతో చెప్పాలని ఆయన ఆరాటపడుతున్నారు. ఎలా ఎప్పుడు మొదలెట్టాలా అని మొహమాటపడుతున్నారు.

అయితే అలా ఆయన మొహమాటపడే అవసరం లేకుండానే - రాదనే తెలియడానికి ఒక్కరోజు కూడా పట్టలేదు-

మర్నాడు -కమ్యూనిటీ హాల్లో మీటింగ్ వుందని కాలనీ వాసులందరూ రావాలని సర్క్యులర్ పంపించాడు అసోసియేషన్ సెక్రట్రీ! పనిలో పనిగా అమెరికా నుంచి వచ్చిన డా॥సుప్రకాశ్ గార్కి చిన్న సత్కార కార్యక్రమం కూడా వుందని అందులో సూచించారు. రామచంద్రమూర్తి గార్కి సంతోషం కల్గినా -"ఒరే ప్రకాశ్ నీ పర్మిషన్ తీసుకున్నారా?"- అని అడిగారు.

''యస్ డాడి! నిన్న నేను వాకింగ్‌కి వెళ్ళినప్పుడు -ప్రెసిడెంట్ వాసుదేవరావుగారు కనిపించారు. మాట్లాడేరు. అమెరికా విశేషాలు- అనుభవాలు, మన కాలనీ వాసులందరికీ

చెప్పమన్నారు. అందుకనే బహుశా ఈ ప్రోగ్రాం అరేంజ్ చేసి వుంటారు". "అలాగా? మంచిదే?" అన్నారు. ఆ సందర్భంలోను తను కూడా ఇక ఇండియాలోనే వుండిపొమ్మనీ (వచ్చేయమనీ) ఇక్కడ ప్రాక్టీసు చేయమని చెప్పాలనుకున్నారు మనసులో..

రామచంద్రమూర్తిగారు కొడుకుతో కలసి కమ్యూనిటీ హాలుకి వెళ్ళేరు. అసోసియేషన్ ప్రెసిడెంట్ వాసుదేవరావుగారు-ముందుగా కాలనీ బాగోగుల్ని గురించి మాట్లాడేరు. తర్వాత డా॥సుప్రకాశ్‌ని మాట్లాడమని కోరేరు.

గొంతు సవరించుకొని ప్రకాశ్ ప్రారంభించేడు.

"నేను స్టేట్స్‌లో ఉన్నప్పుడు ఒక ఆలోచన నన్ను నిలదీసింది! చాలా బాధపడ్తున్నాను. అక్కడ జాబ్ చేసేవాళ్ళకి కొన్ని సదుపాయాలు ఉన్నాయి. ఓల్డ్ఏజ్ హోమ్‌లు- బేబీసిటింగ్‌లు పుష్కలంగా వున్నాయి. అందువల్ల జాబు చేసేవాళ్ళకి -వృద్ధుల్ని గురించి, పిల్లల్ని గురించి, బాధ పడాల్సిన అవసరం లేదు.. కానీ మన ఇండియాలో అయితే.. ఇంటి దగ్గర ముసలివాళ్ళు ఎలా వున్నారో అని, పిల్లలు ఏం చేస్తున్నారో అనీ - ఒకటే వర్రీ అవుతూ వుంటారు. వాళ్ళకి తగిన రక్షణ లేకపోవటం వల్ల సౌకర్యాలు కల్పించక పోవటం వల్ల - ఉద్యోగస్థులకి చాలా చింతగా వుంటోంది. ఫర్ ఎగ్జాంపుల్-- నేను స్టేట్స్‌లో వున్నా-ఇక్కడ మా ఫాదర్ మదర్ ఎలా వున్నారో అని చాలా దిగులు పడుతూనే వుంటాను. అఫ్‌కోర్స్- మా తమ్ముడు ఇండియాలోనే వున్నాడు. కానీ ఎక్కడో నార్త్‌లో వాడుంటాడు-తప్పదు! జాబులు అలాంటివి! అందుకే చాలా కాలంగా ఆలోచిస్తూ- ఒక డెసిషన్ తీసుకున్నాను - మా పేరెంట్సు లాంటి వాళ్ళెందరో ఉన్నారు. ఇలాంటి వాళ్ళందరికీ ఉపయోగపడేలాగ ఇక్కడ ఐమీన్ ఇండియాలో ఒక వోల్డేజ్ హోమ్ కట్టించాలనుకుంటున్నాను. దాని మేనేజ్‌మెంట్ ఎవరికైనా మంచివాళ్ళకి ఒప్పగించాలని వుంది. ఫష్టు నేనే దానికి ఇన్నాగ్రేషన్(ఫంక్షన్)జరిపి - మా ఫాదర్‌ని మదర్‌ని అందులో చేర్పిస్తాను. నాలాగే ఎవరైనా వారి పేరెంట్స్ కోసం దిగులు పడేవారుంటే -తప్పకుండా వారు ఆ ఆశ్రమంలో చేర్పించుకోవచ్చును. అప్పుడు స్టేట్స్‌కి వెళ్ళాలనుకునేవారు, దూర ప్రదేశాల్లో జాబుల్లో వుండేవారు బాధపడక్కర్లేదు. ఇప్పుడు కూడా ఇక్కడ కొన్ని వోల్డేజ్ హోమ్‌లున్నాయని విన్నాను - అయితే మంచి సదుపాయాలతో - మాడ్రన్ ఫెసిలిటీస్‌తో - కట్టాలని అనుకుంటున్నాను -డాక్టర్ చెకప్‌మెంట్‌కూడా వుండాలనుకుంటున్నాను -మంచి ప్లేస్‌లో ఇంజనీర్స్‌తో మాట్లాడి నిర్ణయం తీసుకుంటాను -ఏర్పాట్లన్నీ చేసి-నేను స్టేట్స్‌కి వెళతాను. తిరిగి బిల్డింగ్ పూర్తయ్యే సరికి వచ్చి ఇనాగ్రేషన్ చేసి వెళ్ళిపోతాను.

"సో! ఎవరికైనా నా ప్లాన్ నచ్చి కో ఆపరేట్ చేయాలనుకుంటే వెల్‌కమ్. నాతో మీరు కలిసి పనిచేయవచ్చును. రేపు మీకు కూడా ఈ సమస్య ఎదురైతే, మీ పేరెంట్స్‌ని ఎక్కడ వుంచాలా అనుకోనవసరం లేదు.. వృద్ధుల కోసం నేను తలపెట్టిన ఈ కార్యక్రమానికి -మీరెవరైనా సరే-మీమీ డొనేషన్లు ఇవ్వవచ్చును-" అంటూ ప్రకాశ్ ధారాళంగా స్పీచ్ ఇచ్చేడు-

హాలు మారుమ్రోగిపోయింది చప్పట్లతో!..

ఒకరిద్దరు తప్ప-అంతా సంతోషంగా ఊగిపోయేరు.

ఆ ఒకరిద్దరిలో- రామచంద్రమూర్తిగారు న్నారు. అప్పటికే ఆయన చెవుల్లో ఏదో హోరు బయల్దేరినట్టు అయింది! అసలే వయోవృద్ధులు! ఆపైన అనుకోని అనూహ్యమైన వార్తా సంకలనం!

'ఏమిటీ ప్రకాశ్ చెప్పిందీ? తననీ కృష్ణవేణిని ఆశ్రమంలో చేరుస్తాడా?

'అపుడు స్టేట్స్‌కి వెళ్ళవచ్చునా? వీడు మాకు రక్షణ కల్పిస్తాడా.'

'అమెరికాలో ఉన్నంతకాలం ఇదే ఆలోచించాడా?'

'వృద్ధ తల్లిదండ్రుల్ని ఆశ్రమంలో ఉంచాలని నిర్ణయం తీసుకున్నాడా?'

మేమెంత పిచ్చివాళ్ళం? కొడుకు ఇండియాకి వస్తాడనీ -అందరం కలసి హాయిగా ఉండొచ్చుననీ ఆశించామే కానీ.. వాడేదో మాకు సేవలు చేయాలని, తమని పోషించాలనీ

వెంపర్లాడిపోలేదే? ఆర్థికంగా కానీ, శారీరకంగా కానీ వాడి సహాయ సహకారాలు అర్థించలేదే? అనురాగం- ఆప్యాయత-మమత.. ఇవి దగ్గరగా చూడాలనుకున్నామే గానీ, మమ్మల్ని గురించి చింతపడేలా మేము ప్రవర్తించలేదే? రాత్రింబగళ్ళు మీ ఆరోగ్యాలని గురించి, ఇండియాకి వస్తే-మీ సదుపాయాల్ని గురించి ఆలోచించామే కానీ- మా ఆరోగ్యాలు, మా సుఖాల కోసం మేము బాధ పడడం లేదు? వీడికి ఈ ఆలోచన మనసులో వుందని నాతో మాటమాత్రంగానైనా ఇంట్లో చెప్పలేదు? ఇది వినడానికా నేను ఈ మీటింగ్‌కి వచ్చాను??'

రామచంద్రమూర్తిగారి మేధలో సుళ్ళు తిరుగుతున్న భావపరంపరల్ని అదుపు చేసుకుంటున్నారు. హాల్లో చాలా మంది ప్రకాశ్‌ని మెచ్చుకుంటున్నారు. ప్రశంసిస్తున్నారు. అతన్ని కన్న తల్లితండ్రులు 'అదృష్టవంతులు' అంటున్నారు... అవన్నీ ఆయన చెవులకి వినిపిస్తూనే వున్నాయి. శరీరాన్ని అదుపులో పెట్టుకుంటూ మెల్లగా లేచి నిలబడ్డారు-

"నేను నాల్గు మాటలు చెప్పాలనుకుంటున్నాను" అన్నారు.

'తప్పకుండా చెప్పాలి' అంటూ అందరూ ఆమోదం తెలియజేసేరు.

"డా. సుప్రకాశ్ అమెరికా నుంచి వచ్చి -ఇండియాలో వృద్ధాశ్రమం కట్టాలన్న ఉద్దేశ్యం మంచిదే!-కాని అదేదో ఘనకార్యం అనీ.. ఆదర్శంగా తీసుకోనవసరం లేదు. ఎవరూ లేని ఒంటరివాళ్ళకీ, శరీర దారుఢ్యం లేని వారికీ, ఆర్థికంగా హీన స్థితిలో వున్న వారికీ -తప్పకుండా ఇతరుల సహాయం, రక్షణ, అవసరం కావాలి. అలాంటి వారికి-ఆశ్రమాలే-శరణ్యం! కానీ ఓల్డ్‌ఏజ్ హోమ్ కట్టిస్తున్నా కదా అని ఇంట్లో ఉండే పెద్దాళ్ళని అందులో చేర్పించి అదేదో గొప్పగా చెప్పుకోనవసం లేదు-

"వృద్ధులంతా ఆశ్రమాల్లో ఉండి పిల్లలంతా కేర్ సెంటర్‌లలో ఉంటే -ఇక సమాజంలో-మిగిలేదెవరు?? మానవత, మమత-అనుబంధం- ఆప్యాయత-ఇవన్నీ డబ్బుతో కొనుక్కునే వస్తువులు కాదు! కరెన్సీ నోట్లు కడుపులో ఇమడవు!!ఆకలివేస్తే అన్నం తింటారు గానీ రూపాయనోట్లు కాదు! వేదన-బెంగ-దిగులు-ఒంటరితనం-లాంటి అనారోగ్యాలు, మందుల వల్ల తగ్గవు! ప్రేమ...రక్త సంబంధం... కన్నవారి తోడు-మాటలో మంచితనం- ఇవి..ఇవే నిజమైన టానిక్కులు!!ఇటు పిల్లలకీ, అటు వృద్ధులకీ 'వారధి'లాంటి వారు కావాలి. కానీ వయస్సులో ఉన్నవాళ్ళంతా-అదే యదార్థం, శాశ్వతం అనుకోవడం పొరపాటు. వార్థక్యం అనేది చరిత్రలో ఒక అధ్యాయం, ఒక పేజీ. అది చింపేయవలసిన పేజీ కాదు. వృద్ధాప్యం అరికట్టడానికి ఏ మందులూ లేవు. అంటువ్యాధిలా అది అందరికీ వస్తుంది! సుప్రకాశ్! నువ్వు డాక్టర్‌వి గనుక నీ భాషలోనే చెప్తున్నాను-నీకు వృద్ధాప్యం అనే జబ్బు వస్తుంది! అప్పుడు నీవు కట్టిస్తున్న ఓల్డేజ్ హోమ్‌లో నీకూ ఓ బెడ్‌రూమ్-కావల్సి వస్తుంది! సో... నువ్వు ఇప్పుడే రిజర్వ్ చేసి ఉంచుకో-అని సభ్యుల వైపు చూసి

"మీ అందరికీ ఓ సంగతి చెప్తున్నాను. ఇక మీదట నా ఇంట్లో ఒక అనాథ శరణాలయం ఏర్పాటు చేయాలనుకుంటున్నాను. ఉచిత భోజనం, విద్య ఏర్పాటు చేస్తున్నాను. ఏ దిక్కూలేని వారికి రక్షణగా తండ్రిగా ఉంటాను. నాకూ నాభార్యకీ-ఓపిక, శరీరంలో సత్తువ మిగిలేవున్నాయి. స్వార్జితమైన ఇల్లు, పొలం, సంపాదన అంతా... నేను అనాథ బాలబాలికలకు వినియోగిస్తాను. అలాంటి పిల్లలెవరైనా ఉంటే నా ఎడ్రసు చెప్పి పంపించండి! అన్నారు.

హాలంతా నిశ్శబ్దంతో.. అవాక్కైపోయిన.. సభ్యులతో-మౌనముద్ర వహించినట్లైంది. ఆ తర్వాత జరగబోయే సత్కార కార్యక్రమానికి ఆయన ఉండలేదు. రామచంద్రమూర్తిగారు-హాలు నుంచి బయటికి వచ్చారు. తన నిర్ణయం కృష్ణవేణమ్మకి చెప్పాలని వడివడిగా అడుగులు వేసేరు. ఎనభై రెండు సంవత్సరాల వయస్సులో ఒకరిమీద ఆధారపడకూడదని, తానే పది మందికి పెట్టి-మమతానురాగాలు పంచి ఇవ్వాలనే, ఆయన ఆత్మ విశ్వాసానికి దృఢ సంకల్పానికి -ప్రకృతి తలవంచి జోహారులర్పించింది!!! ❑